# వింత కోరిక

జి.కాంతి ప్రణీత

కథ




"ఏయ్‌మల్లీ ! ఏం చేస్తున్నావ్ ? ఒకసారి ఇలారా, నా షర్ట్ కన్పించడంలేదు" అంటూ భార్యని పిలిచి, కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు అభిజిత్.

"ఏంటండీ చిన్నపిల్లాడిలా ! అక్కడే ఉంటుంది వెదుక్కోండి. మీకు టిఫిన్ చేసే హడావిడిలో ఉన్నాను. ఇలా ప్రతీదీ వెదికిపెట్టి ఇవ్వాలంటే కష్టం బాబూ !" అంటూ బదులిచ్చింది అతని అర్ధాంగి మల్లి.

"అబ్బా! ఒకసారి ఇటు రారాదూ, నా బాధ అర్ధం చేసుకోవూ!" అన్నాడు మనసులో ఏదో చిలిపి ఊహ వచ్చిన అభిజిత్.

ఇలాంటి కేకలు మల్లికి మామూలే. తీరా అక్కడికి వచ్చాక ఆమెని అల్లరి పెట్టడం, ఆ తర్వాత అక్కడినించి అభిని ఆఫీసుకి కష్టమ్మీద పంపడం మల్లికి అలవాటైపోయింది.

ఇక చేసేదేం లేక బెడ్‌రూంలోకి వచ్చింది మల్లి. ఆమె రాకని గమనించిన అభి, మల్లిని మాటల్లో పెట్టి తనకి 'కావలసింది' పొందడం కోసం ఏం చేయాలో అని ఆలోచించడం మొదలెట్టాడు.

మల్లి రావడం, బీరువాలోంచి షర్ట్ తీసి బటన్స్ విప్పి అభికి తొడగడం క్షణాల్లో జరిగిపోయింది.

అయితే ఆ టైం కోసమే ఎదురుచూస్తున్న అభి, నునుపైన ఆమె నడుముపై ఓ చక్కిలిగింత పెట్టడం, ఉలిక్కిపడిన మల్లి అక్కడి నించి వెళ్ళిపోతానని గొడవ చేయడం అభికి భలే ముచ్చటేసింది.

"మల్లీ! అలకలో కూడా నువ్వెంత బాగుంటావో తెలుసా!...." అంటూ ఇంకేదో మాట్లాడబోతుంటే మధ్యలోనే కట్ చేసి "ఏమండోయ్ శ్రీవారూ! మీ మాటలు కట్టిపెట్టి టిఫిన్ తిని ఆఫీసుకు బయలుదేరండి. లేదంటే మీ బాస్ చేత తిట్ల టిఫిన్ తినాల్సిందే" అని అతనికి కర్తవ్యాన్ని బోధించింది.

"ఆ.. రోజూ ఉండేదే కదా! ఒక్కరోజయినా పెళ్ళాంతో సరసాలు సాగించటానికి ఉండట్లేదు" అంటూ చిరుకోపం ప్రదర్శించాడు అభి. "ఏంటి బాబూ ! పెళ్ళాంతో సరసాలాడడానికి ఓ టైం అంటూ వుండదా మీకు?! ఆఫీసు టైంలో వేరే పన్లు చేయడం బాగోదుగానీ త్వరగా తెమలండి" అని మళ్ళీ పోరు పెట్టింది.

★ ★ ★ ★

ఐదేళ్ళ నుంచీ అభి, మల్లిల సంసార జీవితం ఇలాగే సాఫీగా సాగుతోంది. భార్యను క్షణమైనా వీడి వుండాలని వుండదు అతనికి. ఎప్పుడూ అదే ధ్యాస కాకపోయినా ఆమె చెంత వుంటే అభికెంతో ఉత్సాహంగా వుండి, అతనిలో నూతన చైతన్యం ఉరకలెత్తుతుంది. కానీ అలా తను అనుకున్నప్పుడు సెలవుపెట్టి, భార్యతో సంతోషంగా గడిపే వీలు అతనికుండదు. అభిజిత్ ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. పై ఆఫీసర్ చండశాసనుడు కావడంతో ఒకోసారి తన కోరికలకు ఫుల్‌స్టాప్ పెట్టి, అతి కష్టం మీద ఆఫీసుకి బయలుదేరడం అలవాటు చేసుకున్నాడు.

తన పెళ్ళి ఎలాంటి పరిస్థితుల్లో జరిగిందో అతనికింకా కళ్ళకు కట్టినట్టే వుంది. చాలా విచిత్రంగా, రొటీన్‌కి భిన్నంగా జరిగిన పెళ్ళది....

★ ★ ★ ★

"అభీ! నీ పెళ్ళెప్పుడు?" రోజూ కొలీగ్స్ అడిగే మాటలకి విసుగెత్తిపోయాడు అభిజిత్.

ఆఫీసులో బాస్ రానప్పుడు స్టాఫ్ అంతా ఏదో టాపిక్ మీద మాట్లాడుతుంటారు. చివరికి ఆ టాపిక్ అటు తిరిగి ఇటు తిరిగి చివరికి అభిజిత్ పెళ్ళి మీదకి మళ్ళుతుంది. దానికది మళ్ళకపోయినా, దాన్ని రూటు మళ్ళించే ఎవడో ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్ వుండనే వుంటాడు.

తనను ఇబ్బందిపెడుతూనే వుంటాడు. ఆ తర్వాత ఖంగుతినడం అభి వంతవుతుంది.

అనకాపల్లిలో బెల్లం మార్కెట్ నుంచి ప్రారంభించి, అమెరికాలో కంప్యూటర్ ఉద్యోగాల వరకూ వెళ్లిన చర్చాకార్యక్రమం తిరిగి తన పెళ్లి దగ్గరికే వస్తుంది. మరోసారి, ఎక్కడినించో పెళ్లిపాటలు వినిపిస్తే ఇక ఆ చర్చ మళ్లీ అభి పెళ్లి దగ్గరికొచ్చి ఆగుతుంది.

ఇదంతా చూస్తుంటే 'ఆవు – గడ్డి' వ్యాసం గుర్తుకొస్తుంది.

"అభీ! నువ్వింకా పెళ్లి ఎందుకు చేసుకోలేదు?" అంటూ ఏమీ ఎరగనట్టు అడుగుతాడు సీనియర్స్‌లో సుబ్బారావు. వెంటనే ఏం సమాధానం చెప్పాలో తెలీక సతమతమవ్వడం అభికి అలవాటైపోయింది.

అభికి ఇంకా పెళ్లి కాకపోవడానికి కారణం, అతనికి ఇంకా ఏ అమ్మాయీ నచ్చకపోవడమే. చాలా సంబంధాలు చూశాడు. ఒక్క పిల్లా నచ్చలేదు. తన ఊహలకు తగ్గట్టు లేని సంబంధాలు తనెలా ఒప్పుకుంటాడు మరి! అలా అని జగదేకసుందరి కోసం తను ఆశించలేదు. కట్నాల పిచ్చి లేనే లేదు. ప్రేమ దోమా లాంటి ఇతర ఎగ్స్ట్రా క్వాలిఫికేషన్సూ లేవు. సంప్రదాయబద్ధంగా ఉండి, కనీసం డిగ్రీ చదివిన అమ్మాయి కావాలని అతని కనీస కోరిక.

పెళ్లి సంబంధాలు రావడం, అమ్మాయి చదువుకున్నది కాకపోవడమో, సంప్రదాయాల గురించి తెలియని అమ్మాయి కావడమో జరుగుతోంది. 'ఇలా అయితే నీకు పెళ్లి కావడం కష్టం' అని ఇంట్లోవాళ్లు అనడం, వారి మాటలు విని అభి కొంతకాలంపాటు డీలా పడిపోవడం మామూలైపోయింది.

ఇలా నిస్సారంగా జరుగుతున్న అభి జీవన ప్రయాణం ఓ పెళ్లి చూపుల్లో మలుపు తిరిగింది.

తన చిన్నాన్న కూతురి పెళ్లికని ఓ మారుమూల ప్రాంతానికి వెళ్ళిన అభిజిత్ ఓ అమ్మాయిని చూడడం, ఆ అమ్మాయి పెళ్లి కూతురికి ఫ్రెండ్ కావడంతో ఇక అతనిలో ఆశలు చిగురించాయి.

"అన్నయ్యా! నువ్వు చూసిన అమ్మాయి మా క్లాస్‌మేట్. పేరు మల్లీశ్వరి !" వివరాలు చెప్పింది పెళ్లికూతురు మాధవి.

"థాంక్స్‌రా ! మంచిమాట చెప్పావు. నువ్వు పెళ్లి చేసుకుని మళ్లీ హైదరాబాద్‌కొచ్చి ఫ్యామిలీ పెట్టేదాకా నేనే స్వయంగా అన్ని పనులు చేస్తాను" అని ఎగిరి గంతేశాడు అభిజిత్.

"పోరా ! ఆశ దోసె అప్పడం వడ. నా వంక పెట్టుకుని అస్తమానం ఆ అమ్మాయిని చూద్దామనా?" అన్నయ్య మనసులోని ఆలోచనని కనిపెట్టేసింది మాధవి.

"అదికాదురా ! ఒకసారి అమ్మాయిని పిలువ్" అని రిక్వెస్ట్ చేశాడు అభిజిత్.

"నేను పిలిచానంటే అసలు రాదు. ఎందుకంటే మేమిద్దరం మొన్ననే మాటా మాటా అనుకున్నాం" అబద్ధమాడింది మాధవి.

"ప్లీజ్‌రా! అలా అనకు.. నా బుజ్జివి కదూ..."అని బ్రతిమలాడాడు అభి.

"అలాంటి పప్పులేం ఉడకవ్! ఆ అమ్మాయిని పిలిస్తే నాకేమిస్తావ్?" అంది మాధవి.

"బ్లాక్ మెయిల్ చేయడానికి ఇది టైం కాదురా" కోప్పడ్డాడు అభి.

"బ్లాక్ మెయిల్‌లేదూ... హౌరా మెయిల్ లేదు" మళ్ళీ బదులిచ్చింది మాధవి.

చెల్లి పెళ్లి పుణ్యమాని ఆ అమ్మాయిని రహస్యంగా చూడడం, అభికి నచ్చడం అన్నీ జరిగిపోయాయి.

★ ★ ★ ★

మల్లీశ్వరి తల్లిదండ్రులు, అభిజిత్ తల్లిదండ్రులు కుటుంబ సంప్రదాయాలన్నీ మాట్లాడుకున్నాక పెళ్లి చూపుల తతంగం మొదలైంది.

అమ్మాయిని ముందే చూసిన అభి ఏమీ ఎరగనట్టుగా ఆమెతో ఏకాంతంగా మాట్లాడాలని షరతు పెట్టాడు, తాంబూలాల తతంగం అంతా ముగిశాక.

అబ్బాయి తల్లితండ్రులు, అమ్మాయి తల్లిదండ్రులు ముఖాముఖాలు చూసుకున్నారు.

"ఈ రోజుల్లో ఇవన్నీ కామనే!" అని అమ్మాయిని అబ్బాయిని ఓ గదిలోకి పంపేసారు.

"ఏంటండీ, మీరు మరీనూ! ఇలా ఏకాంతంగా మాట్లాడతానని అలా అందరి ముందూ చెప్పేస్తే ఏం బాగుంటుంది?" నాటక ఫక్కీలో ఆ అమ్మాయి ఎలా మాట్లాడుతుందో అలా మాట్లాడాడు.

అభి మాటలకి సిగ్గుపడింది మల్లి. "నేను మీకు నచ్చానా?" అంటూ తన మనసు విప్పింది.

"నా మనసు దోచిన మల్లీ, తీసుకో ఈ జాజిమల్లి" అంటూ కవితాధోరణిలో చెప్పి, తన చేతిలో దాచుకున్న జాజిమల్లి దండని ఆమెకి అందించాడు.

"ఏంటి అబ్బాయిగారికి కవిత్వం వెల్లువలా వచ్చిపడుతోంది" అంది మల్లి నవ్వుతూ.

"అదీ...అదీ.."

"నాన్చకుండా చెప్పండి త్వరగా."

"మన పెళ్లికి కనీసం రెండు మూడు నెలల టైం ఉండాలి" అకస్మాత్తుగా తన మనసులోని మాటని బయటపెట్టాడు అభిజిత్.

'ఎందుకు?' అన్నట్టుగా ముఖం పెట్టింది మల్లి.

"ఎందుకో తర్వాత చెబుతాను" అన్నాడు సస్పెన్స్‌ని విప్పకుండా.

"అలాగే చెబుదాం లెండి" అంది.

ఇద్దరూ బయటికి వచ్చారు.

పెద్దల మాటలవీ అయ్యాక అభి హైదరాబాద్‌కి పయనమయ్యాడు.

★ ★ ★ ★

"పెళ్ళికి ముహూర్తాలు పెట్టుకుంటే బాగుంటుంది" ఇరువైపులా అనుకోవడం విన్పించింది ఇద్దరికీ.

"నాన్నగారూ! నాకప్పుడే పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదు. రెండు నెలలాగండి" అన్నాడు అభి.

"అదేంట్రా! తాంబూలాలు తీసుకుని అలా ఆగితే ఏం బాగుంటుంది? ఎవరైనా ఏమనుకుంటారు?" అన్నారు అభి నాన్నగారు.

"అలా కాదు! ఈ విషయంలో నా మాట వినండి" అన్నాడు అభి.

"పోనీలెండి అబ్బాయిమాట మన్నించండి" ముద్దుల కొడుక్కి అమ్మ సపోర్టు. ఇక కాదనలేక వియ్యంకుడికి ఫోను చేసి విషయం చెప్పారు. అక్కడ కూడా ఇదే సీన్ ప్రత్యక్షం కావడంతో విషయం తెలియని అభి, మల్లిల తల్లిదండ్రులు పెళ్లికి ముహూర్తాలు పెట్టించడం వాయిదా వేశారు.

★ ★ ★ ★

"పోస్ట్.... పోస్ట్...." పోస్ట్‌మెన్ కేకతో ఉలిక్కిపడింది అభి ఆలోచనల్లో ఉన్న మల్లి.

'నాకెక్కడి నుంచి లెటర్ వస్తుందబ్బా!' అనుకుంటూ ఉత్తరం అందుకుంది.

ఫ్రం అడ్రసు చూసి ఆశ్చర్యానందంలో మునిగిపోయింది.

"ప్రియమైన మల్లికి!

ఏంటి... ఉత్తరంలో ఏముంటుందా అని ఆలోచిస్తున్నావా? మన తాంబూలాలకి, పెళ్ళికి టైం అడిగింది ఎందుకో నీకు ముందు ముందు తెలుస్తుంది. అందరిలా తాంబూలాలు, వెంట వెంటనే పెళ్ళి నాకిష్టంలేదు. అందుకే నీతో ముందుగా మాట్లాడి వ్యవధి అడిగింది. నిన్ను తొలిసారి చూసినప్పుడే నా మనసును దోచుకున్నావు. నా మనసు దోచిన నీతో ప్రేమ ఊసులు చెప్పాలని వుంది. అందుకే ఈ లేఖాప్రవహానం.... మనం పెళ్లి చేసుకునేనాటికి మన ఇద్దరి మనసులూ ఏకమవ్వాలంటే, అందుకు మనం వారానికి మూడేసి ఉత్తరాలు రాసుకోవాలి. ఉత్తరాలా.... సారీ ప్రేమలేఖలు అందాం. ఆ ఉత్తరాల్లో నీ మనసులోని భావాల్ని నీవు, నా మనసులోలని భావాల్ని నేను అక్షరీకరించుకుందాం. ఇలా ప్రేమలేఖల ద్వారా మానసికంగా మనం దగ్గరవ్వాలి. ఒకరి అభిప్రాయాలు, ఆలోచనలు మరొకరికి తెలి యాలి. టెక్నాలజీ ఇంతగా డెవలప్ అయింది కదా! ఉత్తరాలేంటి అంటావా? ఫోన్‌లో గంటలు గంటలు మాట్లాడుకుంటే బాగానే ఉంటుంది. కానీ ఆ మాటలు మళ్లీ వినలేం. అదే ఉత్తరం రాస్తే ఆ ఉత్తరాన్ని వదిలంగా దాచుకుని నేను గుర్తొచ్చినప్పుడు నీవు, నీవు గుర్తొచ్చినప్పుడు నేను చదువుకోవచ్చు.

నా ఆలోచన నీకు నచ్చిందనుకుంటాను. ప్రేమలేఖలు రాసుకోవడంలో ఉన్న మాధుర్యం నీకు ముందు ముందు తెలుస్తుంది. అప్పటివరకూ సెలవ్.

నా మనసుని మల్లెతీగలా అల్లుకున్న నా మల్లికి....

–నీ అభి......"

ఉత్తరం చదువుతున్నంతసేపూ మల్లీశ్వరి నోట మాట రాక అప్రతిభురాలైపోయింది.

వెంటనే తన కర్తవ్యం గుర్తుకొచ్చింది.

"ప్రియమైన శ్రీవారికి!

నా మనసు ఈ రోజు చాలా ఉల్లాసంగా ఉంది. మీ ప్రేమలేఖల ప్రతిపాదన నాకు నచ్చింది. ఉత్తరం రాయడం అంతగా అల వాటు లేని నాకు పెద్ద పరీక్షే పెట్టారు. ఈ ఉత్తరం చిన్నదైనా నా మనసు మీకు తెలియ డానికి ఇది ఒక అద్దంలాంటిది. మీ ఆలోచన, మీ వ్యక్తిత్వం నాకు నచ్చాయి. నా ప్రాణం మీరు. నా మనసులోని భావాల్ని ఒక్కొక్కటిగా మీకు చెబుతాను. ఇప్పుడు బెరుకుగా ఉంది. మీరన్నట్టుగా మనం మానసికంగా దగ్గర కావడానికి ఈ లేఖలు బాగా ఉపయోగ పడతాయి. మళ్లీ నా మనసు చెప్పే ఊసులు మీకు అక్షరాల అల్లిక చేసేవరకూ సెలవు.

నా ప్రాణసఖుడికి ప్రేమతో...

–మల్లి...."

★ ★ ★ ★

ఇలా ఉత్తరాయం సాగుతూనే ఉంది.

పోస్ట్‌మెన్ రావడం ఉత్తరం ఇవ్వడం, తనలో తానే ఆనందోద్వేగంతో నవ్వుకోవడం మామూలైపోయింది మల్లికి.

అభికూడా ఆఫీసుకి వెళ్లేది ఇప్పుడు మల్లి రాసే ప్రేమలేఖలందుకోవడానికేనా! అన్నట్టుగా మారిపోయింది.

వారానికి మూడుఉత్తరాలు, రెండు ఫోన్ కాల్స్‌లా వారి ఉత్తరాయణ, ఫోనాయణ ప్రేమ ప్రహసనం నిర్విరామంగా కొనసాగుతూనే వుంది.

ఆ తర్వాత మూడు నెలలకి ఇద్దరికీ పెళ్లయి పోయింది.

★ ★ ★ ★

తొలిరాత్రి....

పెళ్లికాని ప్రతి అమ్మాయి, అబ్బాయి మధురోహలను నిజం చేసుకునే రోజు.

అప్పటికే మానసికంగా దగ్గరై, భార్యా భర్తలైపోయిన అభి, మల్లిలు ఆనందసాగరంలో తేలియాడే క్షణం కోసం ఎదురుచూస్తున్నారు.

అమ్మలక్కలు ఇద్దర్నీ గదిలోకి పంపేశారు.

"ఏమండీ! నాకు బెరుకుగా ఉంది" అనే డైలాగ్స్ వారి మధ్య లేనే లేవ్.

భార్యా భర్తలు స్నేహితుల్లా ఉండాలని చెప్పడానికి వాళ్లే ఒక ఉదాహరణ. ఒకరి ఇష్టాయిష్టాలు మరొకరు తెలుసుకుని ఉండడం వల్ల వారిలో తొలిరాత్రి నాడు ఉండే భయాలు, బెరుకులూ, ఆందోళనలూ ఎక్కడా కన్పించలేదు.

అయితే ఈ సంగతి బయటివారికి తెలియకుండా ముందే జాగ్రత్తపడ్డారు.

వారి అనురాగానికి గుర్తుగా లాలస పుట్టింది.

దాంపత్యంలోని మధురిమని అస్వాదిస్తూ ప్రతిరాత్రిని వసంతరాత్రిని చేసుకుంటున్న ఆ జంటని చూసి పున్నమి చంద్రుడు కూడా అసూయ చెందుతున్నాడు.

పెళ్లికి ముందు పెళ్లిని వాయిదా వేసి, ప్రేమలేఖలు ప్రహసనం సాగించిన భర్త వింత కోరికని తలచుకుంటూ ముసి ముసిగా నవ్వుకుంది మల్లి, అభి రాసిన ప్రేమలేఖలు మళ్లీ మళ్లీ చదువుకున్నప్పుడల్లా... ఆ అనుభవాలు మిగిల్చిన ఆనందానుభూతులు, మధురోహలు జ్ఞాపకం చేసుకున్నప్పుడల్లా....


## ఫిలింగైడ్ ఫ్రీ

కేవలం రూ. 25/-లు ఈక్రింది అడ్రసుకు యం.ఓ. చేయండి. వెంటనే 2 జోకుల పుస్తకాలు, 1 కవితల పుస్తకంతో 2006 ఫిలిం గైడ్ (సినీ తారల, దర్శకులు వగైరా అడ్రసులున్నది) పంపించబడును.

**వై.కె.మూర్తి**
దాసరివారి వీధి, సూర్యారావు పేట,
విజయవాడ-520 002.